


# స్ట్రీకింగ్

బోసు

సినిమానుంచి వస్తున్న కొంతమంది పిల్లలు పరుగెడుతున్న ఆ వ్యక్తిని చూచి "స్ట్రీకింగ్ చేస్తున్నాడు లాగుంది రోయ్" అని ఉత్సాహంగా అరిచారు.

* * *

శామ్యూల్ ఆఫీసునుంచి యింటికి వచ్చాడు. ఇల్లు అంటే ఒక గది మాత్రమే. అతనికి వచ్చే జీతంలో అంతకంటె ఎక్కువ అద్దె యిచ్చి వుండలేడు. ఈ మధ్యనే జరితను వివాహం చేసుకున్నాడు. భార్యతో కలిసి ఉంటున్నాడు.

లోపలికి అడుగుపెట్టగానే జరిత అతనికి ఒక ఉత్తరం అందించింది. శామ్యూల్ ఉత్తరం విప్పి చదివాడు.

శామ్యూల్.

ఏ అడ్రసు ఒక వ్యక్తిద్వారా తెలి

పింది. నేను మావారితో బెజవాడ మీదుగా మా వూరు వెళ్తున్నాను. నీవు తప్పకుండా స్టేషనుకు వచ్చి నన్ను కలుసుకోవలెను. మావారికి నిన్ను పరిచయం చేస్తాను. నీ భార్యతో సహా రావలెను.

మేరీ.

శామ్యూల్‌కి మేరీ కళ్ళల్లో కదిలింది. తను ఒకప్పుడు మేరీని ప్రేమించాడు, వివాహం చేసుకోవాలనుకున్నాడు. ఆమె తనతోపాటే కాలేజీలో చదివేది. మేరీకూడా తనతో చనువుగానే ఉండేది.

తాను ఒకనాడు ఆమెకు ప్రేమలేఖ వ్రాసి అందులో ఆమె అభిప్రాయం అడిగాడు. ఆమెకు ఆలోచించుకోవటానికి కొంత టైము యివ్వాలన్న ఉద్దేశంతో వారం రోజులవరకు ఆమెను కలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యలేదు.

తరువాత కనుక్కుంటే ఆమె క్రితం రోజు ఈ రోజు కాలేజీకి రాలేదు. తరువాత కూడ మేరీ వారం రోజులపాటు కాలేజీకి రాలేదు.

తరువాత రోజు ఆదివారం. ఆదివారం మధ్యాహ్నం తను తన రూములోనే ఉన్నాడు మేరీ తన రూముకు వచ్చింది. మేరీ సిగ్గుపడుతూ కవరొకటి అందించింది. అది శుభలేఖ. తను ఆతృతగా చదివాడు. మేరీకి మహేష్ అన్న వ్యక్తితో పెళ్ళి. తాను నిర్ఘాంతపోయాడు. తన ప్రేమలేఖ సంగతి మేరీ చెప్పలేదు. తాను ఇక అడగనూలేదు. తన బాధను పైకి కనబడనీయకుండా మేరీతో మామూలుగా మాట్లాడాడు. వరుడు మహేష్ గురించి అడిగాడు. మహేష్ ఢిల్లీలో పెద్దఉద్యోగం చేస్తున్నాడట. వివాహమయిన వెంటనే మేరీ భర్తతో ఢిల్లీ వెళ్ళిపోతుందట. తాను ఆమె వివాహానికి తప్పక వస్తానని ఆమెను సాగనంపాడు.

అటు తరువాత యిన్నాళ్ళకు మేరీ నుంచి ఉత్తరం వచ్చింది. ఆమె ఎందుకు వ్రాసిఉంటుందా అనుకున్నాడు. ఆమె భర్త పెద్ద ఆఫీసరు కాబట్టి తమ డాబు, దర్పం చూపించటానికయి వుంటుందనుకున్నాడు.

తాను మేరీని చూచి చాల కాలమయింది. ఆమెను మరల ఒకసారి చూడాలనిపిస్తోంది. బహుశా మేరీని చూడటానికి మరల యింకొక అవకాశం రాకపోవచ్చు. కావున ఈ అవకాశాన్ని జారవిడుచుకో కూడదు. కాని ఎలా? తనకి మంచి బట్టల జత ఒకటీ కూడాలేదే? ఈ నిర్భాగ్యపు స్థితిలో ఆమెని కలుసుకోవటమా? తానుయిక జీవితాంతం మేరీకి నిర్భాగ్యుడుగానే గుర్తుకు వస్తుంటాడు. అలా జరగటానికి వీలులేదు. తనకి రేపటిలోగా మంచి బట్టల జత ఒకటి, బూటు ఒకటి కావాలి. ఎలా?

అతనికి ఒక సంగతి గుర్తుకు వచ్చింది. జరితకు మొన్న వాళ్ళ నాన్న రెండు చీరలు కొనుక్కోమని డబ్బు పంపించాడు. పాపం! జరితకు రెండే రెండు చీరలున్నవి. ఆ సాయంకాలం బజారుకు వెళ్ళి ఆ డబ్బుతో చీరలు కొందామని అన్నాడు.

కాని యిప్పుడు శామ్యూల్ అభిప్రాయం మారింది. జరితకు చీరలు తరువాత చూసుకోవచ్చు అనుకున్నాడు. ఈ ఆలోచన రాగానే శామ్యూల్ లేచాడు.

"జరితా, చీరలు నాలుగు రోజులు పోయాక కొందాం. దీపావళి పండుగకి తగ్గింపు రేట్లలో దొరుకుతాయి. నేను బయటికి వెళ్ళివస్తాను" అన్నాడు శామ్యూల్.

శామ్యూల్ ఆ డబ్బుతో బూట్ల జత ఒకటి, టెర్లిన్ బట్టలుజత ఒకటికొన్నాడు. బట్టలుజత టైలర్‌కిచ్చి అర్జంటుగా రేపటికి కుట్టి యివ్వమన్నాడు.

ఇంటికి తిరిగి వచ్చాడు శామ్యూల్. జరితను చూస్తుంటె అతనికి ఏదో దొంగతనం చేసినట్లుగా ఉంది. తాను చాల తప్పుపని చేశానేమోనని బాధకూడా కలిగింది. కాని తప్పదనుకొన్నాడు.

మర్నాడు సాయంకాలం బూటు, కొత్తజత వేసుకుని స్టేషనుకు వెళ్ళాడు

శామ్యూల్. ఒకగంట లేటుగా ట్రెయిన్ వచ్చింది. మేరీ కనబడింది. ఆమెవెంట యింకొక వ్యక్తి ఉన్నాడు. ఆమె భర్తయి ఉంటాడనుకున్నాడు శామ్యూల్.

శామ్యూల్‌ని చూడగానే మేరీ చాలా సంతోషపడింది. "నీ భార్యను తీసుకు రాలేదేం?" అని అడిగింది.

"ఆమెకి వంట్లో కొంచెం సరిగా లేదు. అందుకని తీసుకు రాలేదు" అబద్ధమాడాడు శామ్యూల్.

మేరీ భర్తవంక తిరిగి, "ఇతనేనండి నేనన్న శామ్యూల్" అని శామ్యూల్ వంక తిరిగి, "ఈయన మా శ్రీవారు మహేష్" అని పరిచయం చేసింది.

ఇదరూ కరచాలనం చేసుకున్నారు. శామ్యూల్ మహేష్‌ని పరీక్షగా చూశాడు. మహేష్ అందగాడే. అతను వేసుకున్న బట్టలవంక చూశాడు. ఉలిక్కిపడ్డాడు శామ్యూల్. మహేష్ వేసుకున్నవి మామూలు ఖద్దరు బట్టలు. మేరీవంక చూశాడు. ఆమెకూడా మామూలుగా సాదాగానే ఉంది.

మహేష్ శామ్యూల్‌తో, "మేరీ మీ సంగతంతా చెప్పింది. మీ ప్రేమలేఖ సంగతితోసహా! మీరు మా తిరుగు ప్రయాణంలో మాతోపాటు ఢిల్లీ రండి. మీకు తప్పకుండా మంచి ఉద్యోగం ఒకటి చూపించి పెడతాను" అన్నాడు.

శామ్యూల్ అహంకారం అడ్డువచ్చింది. "ఇప్పుడు నేను చేస్తున్న ఉద్యోగం బాగానే ఉందండి." అన్నాడు తెచ్చిపెట్టుకున్న నవ్వుతో. మేరీకి తాను ఏమాత్రం తక్కువవాడుగా కనబడకూడదు.

"ఏం బాగుండీ, రెండువందల రూపాయలతో పట్నంలో ఏం బ్రతుకుతామండి. రేపు పిల్లలు పుట్టుకవచ్చాక మరీ కష్టంగా ఉంటుంది." అన్నాడు మహేష్.

శామ్యూల్ ముఖం నల్లబడింది. తన బుర్ర పనిచెయ్యలేదు. మేరీకి తన అడ్రసు యిచ్చిన వెధవ తన ఉద్యోగం గురించి కూడా చెప్పి ఉంటాడు.

మేరీ సరయిన తిండిలేక లోపలికి పోయిన శామ్యూల్ దవడలవంక, అతను వేసుకున్న కొత్త ఖరీదయిన జతవంక మరీ మరీ చూస్తోంది.

ట్రైను కూత కూసింది. మేరీ మహేషులు శామ్యూల్‌ని ఆలోచించుకుని తప్పక రావాలని చెప్పి సెలవు తీసుకున్నారు.

వాళ్ళు వెళ్ళిపోయాక, తాను స్టేషనుకు రాకుండా వుంటే ఎంత బాగుండేది అనుకున్నాడు శామ్యూల్. తన దైన్యం మేరీకి తెలిసిపోయింది. శామ్యూల్ నడుస్తున్నాడు.

శామ్యూల్‌కి జరిత గుర్తుకు వచ్చింది. మహేష్ మంచితనం గుర్తుకు వచ్చింది. మేరీకి తనపట్ల ఉన్న జాలి గుర్తుకు వస్తోంది. తన మూర్ఖత్వం తెలిసి వస్తోంది. తను వేసుకున్న బట్టల వంక చూసుకుంటాడు. మేరీ చూసిన చూపు కనబడుతోంది రెండే రెండు చీరలతో ఉన్న జరిత కనబడుతోంది. తన బట్టలవంక, బూట్లవంక చూస్తుంటే శామ్యూల్‌కి వెంపరం పుట్టుకవస్తోంది. వంటిన ఏదో దయ్యం పట్టినట్టు అనిపిస్తోంది. ఇక భరించలేకపోతున్నాడు. చొక్కావిప్పి ప్రక్కనే పడేశాడు. పాంటు విప్పి అవతల పారేశాడు. బూట్లు దూరంగా విసిరేశాడు. అతని హృదయంలో జరిత దీనస్వరూపం కనబడుతోంది. త్వరగా, త్వరత్వరగా నడుస్తున్నాడు. పరుగెత్తుతున్నాడు, శామ్యూల్ జరిత కాళ్ళమీదపడి క్షమాపణ చెప్పుకుని ఆమె హృదయంమీదపడి భోరున ఏడవాలని త్వరత్వరగా పరుగెత్తుతున్నాడు. ★

ముల్లు ఎంత చిన్నదైనా కాలికి బాధ కలిగించినట్లు, శత్రువు ఎంత అల్పుడైనా ఎంతో బాధాకరుడవుతాడు.